క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన 'కొత్వాల'

సూపర్‌బజార్(కొత్తగూడెం): టీజీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులైన డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావును కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం అభినందించారు. కలెక్టర్‌ను కొత్వాల మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సన్మానించారు. జిల్లా సహకార అధికారి ఖుర్షిద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుబ్బారావు, కొండెం వెంకన్న పాల్గొన్నారు.

అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌ను కలిసిన నాయకులు

ఇల్లెందు: తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను ఇల్లెందు, గార్ల మండల కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డా డానియేల్, పులి సైదులు, ధనియాకుల రామారావు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అటవీశాఖ కార్యాలయంలో ఆయనను కలిసిన వారు శాలువ, పూలమాలతో సత్కరించారు.

డీఎస్సీ వాయిదా వేయాలి

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన డీఎస్సీని వాయిదా వేసి 25వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించాలని పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వాంకుడోత్ మోతీలాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. వరుస పోటీ పరీక్షల కారణంగా నిరుద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని, గ్రూప్-2 పరీక్షలను కూడా కొంతకాలం వాయిదా వేయాలని కోరారు. ఆయా అంశాలపై నిరుద్యోగ యువకులు సచివాలయం ఎదుట ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం అనాలోచితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

కొత్త చట్టాలపై అవగాహన

జూలూరుపాడు: కొత్త నేర చట్టాలు, మాదకద్రవ్యాలు, మహిళల భద్రత, బాల్య వివాహాలు, ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం పోలీసులు ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ... జూలై 1వ తేదీ నుంచి కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని, ఈ చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. వాహనాల అన్ని ధ్రువపత్రాలు ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. పాపకొల్లు, చంద్రుగొండ క్రాస్ రోడ్ అడ్డాల ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ డెయిరీలో నర్సింగ్ విద్యార్థినులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం రోటరీనగర్‌లోని ప్రభుత్వ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ విజయ డెయిరీని భద్రాద్రి జిల్లా కొత్తగూడెంకు చెందిన సింగరేణి నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు శుక్రవారం సందర్శించారు. విజ్ఞాన యాత్రలో భాగంగా డెయిరీకి వచ్చిన వారు పరిశ్రమలో పాల శీతలీకరణ, శుద్ధి, నిల్వ, ప్యాకింగ్ తదితర అంశాలను పరిశీలించగా అధికారులు వారికి వివరాలు వెల్లడించారు.

చెరువు కట్టను అభివృద్ధి చేస్తాం..

ఇల్లెందు: ఇల్లెందు చెరువు కట్టను సుందరంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం చెరువు కట్టను సందర్శించి పరిశీలించారు. మాట్లాడుతూ.. కట్టపై ఎదిగిన పిచ్చి మొక్కలు, చెరువులో నాచును తొలగిస్తున్నామని చెప్పారు. చెరువు కట్టను పర్యాటకులు సందర్శించేలా తయారు చేస్తామన్నారు. కమిషనర్ యాదగిరి, మేనేజర్ అంకుషావలీ, డీఈ నవీన్, ఏఈ కుమారస్వామి, కౌన్సిలర్లు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి

ఇల్లెందు: ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు హరీష్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లెందులోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించకపోవటం, ఉపాధ్యాయులను నియమించకపోవటం వల్ల అనేక పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణం విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు. అధికారులు ప్రజాప్రతినిధులు విద్యాలయాలను సందర్శించాలని కోరారు.

ఉచిత శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: గ్రూప్ -1 ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయిన మైనారిటీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని మైనారిటీ స్టడీ సర్కిల్‌లో అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాకూబ్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుండి 70 రోజులు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థుల ఇక్కట్లు

జూలూరుపాడు: మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీ పెద్దతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇక్కట్లు పడుతున్నారు. వర్షాలకు పాఠశాలకు వెళ్లే రోడ్డంతా బురదమయంగా మారడంతో అవస్థలు పడాల్సి వస్తోంది. ఇదే పాఠశాల ప్రాంగణంలోనే అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సైబర్ నేరాలతో పరేషాన్

- ఆన్‌లైన్‌లో రెచ్చిపోతున్న నేరగాళ్లు
- అవగాహన లేక నష్టపోతున్న బాధితులు
- పరువు కోసం పోలీసులకు ఫిర్యాదు చేయలేక పలువురి ఆవేదన



పాల్వంచ: ఆన్‌లైన్ మోసాలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రజల అమాయకత్వాలను, అత్యాశను ఆసరాగా వల విసిరి వారి అకౌంట్ల నుంచి డబ్బుల స్వాహాకు పాల్పడుతున్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడి అనేక మంది ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇంటి వద్దే ఉండే మహిళలు పార్ట్‌టైం జాబ్ చేస్తూ సంపాదించుకోవచ్చని, తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు పొందవచ్చని, ట్రేడ్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి అధిక మొత్తంలో సంపాదించవచ్చని చెబుతూ ఫోన్ కాల్స్ చేస్తున్నారు. మానిలాండరింగ్ కేసుల్లో చిక్కుకున్నారంటూ బెదిరింపులకు దిగుతూ అకౌంట్లలో నగదును వేయించుకుని అందుబాటులో లేకుండా పోతున్నారు. అప్పటి వరకు ఎంతో నమ్మబలుకుతూ నగదు బదిలీ చేయించుకున్న క్షణాల్లో ఫోన్‌లు కూడా కలవక పోవడంతో మోసపోయినట్లు గుర్తించి బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ తరహా సైబర్ నేరాలతో ఇటీవల కాలంలో జిల్లా వ్యాప్తంగా అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. పాల్వంచ పట్టణంలో పలువురు తమ డబ్బులు పోగొట్టుకుని ఆందోళన చెందుతుండటం పరిపాటిగా మారింది.

అవగాహన లేక నష్టపోతున్న బాధితులు...

సైబర్ నేరాల్లో అనేక మంది సరైన అవగాహన లేక నష్టపోతున్నారు. ముఖ్యంగా పలు కంపెనీల్లో పెట్టుబడి పెడితే అధిక మొత్తం సంపాదించే అవకాశం ఉందని నమ్మబలికి అకౌంట్లలో నగదు బదిలీ చేయించుకోవడం,

ఆధార్ కార్డుతో వేరే వ్యక్తులు పలు కేసుల్లో చిక్కుకున్నారని, వాటి వల్ల మీపై కూడా కూడా కేసు అయిందని భయభ్రాంతులకు గురి చేస్తుంటారు. సీబీఐ, ఈడీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులమని, వీడియో కాల్ చేస్తుంటారు. ఈ క్రమంలో వారు ఆయా డిపార్ట్‌మెంట్ యూనిఫాంల్లో కనిపించడం, వారి వెనుక ఉండే పరిసరాలు ఆఫీస్‌లను తలపిస్తూ కనిపిస్తుంటాయి. దీంతో వారు నిజమనే భ్రమ కల్పిస్తారు. లాటరీలో మీ పేరు మీద ప్రైజ్ వచ్చిందని, అది ఎయిర్ పోర్ట్‌లో చెకింగ్ చేయడంతో అక్రమ మాదక ద్రవ్యాలు వచ్చాయని బెదిరించి డబ్బులు పంపిస్తే సెటిల్ అవుతుందని నమ్మబలుకుతారు. అంతేగాక మహిళలతో ఫోన్ చేయించి వారితో ఎంతో కలిసిపోయినట్లు మాట్లాడి వాటిని స్క్రీన్ షాట్‌లు, వీడియోలు తీసి తర్వాత బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజుతుంటారు. బ్యాంక్ అధికారులమంటూ తమ అకౌంట్ వివరాలు అడుగుతుంటారు.

ఇటీవల జరిగిన ఘటనల్లో కొన్ని..

- మనీ లాండరింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు నగదు స్వాహాకు పాల్పడ్డారు. పట్టణంలోని జెన్‌కో కాలనీకి చెందిన ఓ మహిళ సెల్‌ఫోన్‌కు ఈనెల 8వ తేదీన ముంబై పోలీసుల మంటూ ఫోన్ చేశారు. మనీ లాండరింగ్ కేసు రూ.2.50 కోట్లకు ఈ జూన్ 6వ తేదీన కేసు నమోదు అయిందని, కేసు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు కనెక్ట్ చేస్తున్నామని, ఆ కేసు నుంచి బయట పడాలంటే రూ.4లక్షలు జమ చేస్తే పరిష్కారం అవుతుందని నమ్మబలికి నగదు బదిలీ చేయించుకుని మోసానికి పాల్పడ్డారు.
- ట్రేడ్ మార్కెట్‌లో నగదు పెడితే లాభం వస్తుందని నమ్మించి కాంట్రాక్టర్స్ కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్ గత మే 3న మెసేజ్‌తో కూడిన లింక్ వచ్చింది. ఇలా కొంత అమౌంట్ పెట్టించి అధిక మొత్తంలో విత్ డ్రా చూపించారు. అనంతరం రూ.2లక్షలు పెడితే రూ.15లక్షలు సంపాదించవచ్చని నమ్మబలికి నగదు బదిలీ కాగానే మెసేజ్ పంపక పోవడంతో మోసపోయినట్లు గమనించాడు.
- కేటీపీఎస్ కాలనీకి చెందిన ఓ ఇంజనీర్ సెల్‌ఫోన్‌కు మార్చి 12న ఓ లింక్ వచ్చింది. దానిని ఓపెన్ చేస్తే రూ.50వేల నగదు మాయం అయింది.
- పట్టణంలోని ఐఎం కాలనీకి చెందిన ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు టెలీగ్రామ్ యాప్ ద్వారా ఓ లింక్ గత జనవరిలో వచ్చింది. దానిలో డబ్బులు పంపిస్తే ఎక్కువ మొత్తంలో పొందవచ్చని ఉంది. దీంతో పలు దఫాలు అమౌంట్ పంపి రూ.1.77 లక్షలకు మోసపోయాడు.
- పట్టణంలోని నటరాజ్ సెంటర్‌కు చెందిన ఓ వ్యక్తి ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో అన్వేషించగా ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. నగదు పంపిస్తే ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మి బలికి రూ.2.35లక్షలు నగదు బదిలీ చేయించుకుని రెండు నెలలు గడిచినా ఉద్యోగం ఇప్పించక పోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసుల ఫిర్యాదు చేశాడు.

1930 నంబర్‌ను ఆశ్రయించాలి...



సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోయినట్లు అనుమానం వస్తే వెంటనే 1930 (నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్) నంబర్‌కే కాల్ చేయాలని, వెంటనే వారు అడిగే అకౌంట్ వివరాలు చెబితే పంపించిన డబ్బులు ఫ్రీజ్ చేస్తారు. అకౌంట్ కూడా బ్లాక్ అవుతుంది. ఎక్కువ టైం తర్వాత చేస్తే మాత్రం ప్రయోజనం ఉండదు. ఈ నంబర్‌ను ప్రతీఒక్కరు భద్రపర్చుకోవాలి. ముఖ్యంగా మనకు సంబంధం లేని వ్యక్తులకు మన అకౌంట్ వివరాలు తెలపవద్దు, లింక్‌లను అసలు ఓపెన్ చేయొద్దు. బ్యాంక్ అధికారులు సైతం ఎలాంటి ఇబ్బంది ఉన్నా వెంటనే తమ బ్యాంక్‌లకు రావాలని చెబుతారని, మోసగాళ్లు మాత్రమే వివరాలు చెప్పాలని కోరుతారు.

– సతీష్ కుమార్, డీఎస్పీ, పాల్వంచ

డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయండి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులు పర్సనల్, ఫ్యామిలీ వివరాలు డిజిటలైజేషన్ చేయాలని ఏరియా డీజీఎం పర్సనల్ శివకేశవరావు ఆదేశించారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో ఏరియా పర్సనల్ విభాగం, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగి సీఎంపీఎఫ్ క్లెయిమ్‌ను ప్రతీనెల 10వ తేదీలోపు పంపించాలన్నారు. సీఎంపీఎఫ్ చెల్లింపుల విషయంలో ఎటువంటి సహకారం కావాలన్నా రీజియన్ కమిషనర్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గైర్హాజరైన ఉద్యోగులకు ఇచ్చిన చార్జ్‌షీట్‌లను సకాలంలో పూర్తిచేయాలని, పెండింగ్‌లో పనులు వీలైనంత త్వరలో పూర్తిచేయాలని తెలిపారు. కాంట్రాక్ట్ వర్కర్స్‌కు మెడికల్ స్క్రీనింగ్ పరీక్షల వివరాలను అన్ని మైన్స్, డిపార్ట్‌మెంట్ వారిని అడిగి తెలుసుకోవాలన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులతో సంప్రదించి కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా ఇన్సూరెన్స్ కవరేజ్ ఇస్తున్నందున కాంట్రాక్ట్ కార్మికులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఖాతా తీసుకోవాలన్నారు.

21న వర్కర్స్ ఫెడరేషన్ మహాసభ



కార్మికులతో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

టేకులపల్లి: ఈ నెల 21న ఇల్లెందులో జరగనున్న తెలంగాణ ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర 5వ మహాసభను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి నాగేశ్వరరావు, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కేటీసీ ఓబీ క్యాంపు, టిప్పర్ కార్మికుల వద్ద ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమాల్లో మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర రవాణా రంగంలో 25 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని వీరికి సంక్షేమ బోర్డు లేకపోవడం వలన కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లకు ఉరితాడుగా మారిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోటార్ కార్మికుల పట్ల మోదీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని అందులో భాగంగానే పెనాల్టీలు, అక్రమ వసూళ్లు విచ్చలవిడిగా పెంచారని దీంతో డ్రైవర్ల పరిస్థితి అగోమ్య గోచరంగా మారిందన్నారు. డ్రైవర్ల హక్కులకై ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జూలై 21న పోరాటాలకు పురిటిగడ్డ అయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలో జరగనున్నాయని దీనికి ఆటో, మోటార్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యమాలకు సిద్ధం కండి..



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో సింగరేణి బ్లాక్‌లకు వేలంలో పెడుతోందని, ఈ వేలానికి వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతోందని, అయినా కేంద్రప్రభుత్వంలో చలనం లేదని, ఈ నేపథ్యంలో ఈ సాధన కోసం తలపెట్టే ఉద్యమాలకు సింగరేణి కార్మికులు సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సెక్రటరీ కొరిమి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. బొగ్గు బ్లాక్‌ల వేలానికి వ్యతిరేకంగా సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలు శుక్రవారంకు ఆరో రోజుకు చేరాయి. దీక్షలను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వంగా వెంకట్, జి.వీరస్వామి, దమ్మాలపాటి శేషయ్య, జే.గట్టయ్య, ఎస్‌వీ రమణమూర్తి, క్రిష్టాఫర్, సందెబోయిన శ్రీనివాస్, సురేందర్, చంద్రయ్య, ఎస్.సుధాకర్, ఎస్.శ్రీనివాస్, కే.రాజేశ్వరరావు, డి.నర్సింహారావు పాల్గొన్నారు.

వేలాన్ని అడ్డుకుంటాం..

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లను కార్పొరేట్ సంస్థలకు వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించిందని, ఈ చర్యను ఏఐటీయూసీ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ తీవ్రంగా ఖండించిందని, కేంద్రం ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ దీక్షలు చేస్తోందని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ అన్నారు. దీక్షలో పాల్గొంటున్న కార్మికులకు అభినందనలు తెలిపారు. శుక్రవారం ఇల్లెందులోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 130 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణి నిర్వీర్యమైపోతోందని గ్రహించిన కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జూలై 17న హైదరాబాద్‌లో జరగనున్న బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకుంటామని తెలిపారు.

ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా ఇల్లెందు గెస్ట్ హౌజ్‌లో సంస్థ స్థితిగతులు, ప్రాజెక్టులు, వాటి భవిష్యత్ ఉత్పత్తి అంచనాలపై ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) బీఆర్ దీక్షితులు హాజరయ్యారు. మాట్లాడుతూ... గనులలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించటానికి మీవంతు కృషి చేయాలన్నారు.

సంస్థ బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా థర్మల్, సోర, పంప్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తిలో రాణించడానికి తగిన ప్రణాళికలతో ముందుకు సాగుతుందన్నారు. అదేవిధంగా ఎంఎండీఆర్ యాక్ట్ - 1957పై కూడా అవగాహన కల్పించారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించండి

సింగరేణి(కొత్తగూడెం): సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని 8వ వార్డు కౌన్సిలర్ కంచర్ల జమలయ్య అన్నారు. శుక్రవారంలో డ్వాక్రా గ్రూపుల సమైక్యల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లల్లో టైర్లలో గానీ, బకెట్లలో కానీ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా డ్వాక్రా గ్రూపులు స్వయం ప్రతిపత్తి కలిగిన కుటీర పరిశ్రమలు ఇస్తరాకుల తయారీ మిషన్లు గానీ బుట్టలల్లే మిషన్లు గాని, పచ్చళ్ల తయారు చేసేవారికి ఆర్థికంగా చేయూతనివ్వాలని సూచించారు. దీని మీ కుటుంబంలో ఆర్థిక వెసులుబాటు కలుగుతుందన్నారు.

కొత్తగూడెంఅర్బన్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ఇంచి చుట్టు పక్కల నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని 25వ వార్డు కౌన్సిలర్ సాహేరబేగం అన్నారు. శుక్రవారం ఫ్రైడే అండ్ డ్రైడే కార్యక్రమంలో భాగంగా గాజులరాజంబస్తీలో సీజనల్ వ్యాధుల పట్ల స్థానికులకు, వార్డు కౌన్సిలర్ అవగాహన కల్పించారు.

రక్తదాన శిబిరానికి స్పందన

పాల్వంచ: పట్టణంలోని కేఎల్ఆర్ విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ కె.లక్ష్మారెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక కేఎల్ఆర్ ఘాట్ వద్ద పలువురు నివాళులర్పించారు. అనంతరం ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కొత్వాల శ్రీనివాసరావు, కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎస్‌కె.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం పాల్గొన్నారు.

ఎన్ఎండీసీ ప్లాంట్‌ను పునరుద్ధరించాలి

పాల్వంచరూరల్: మూతపడిన స్పాంజ్ ఐరన్ ఎన్ఎండీసీ యూనిట్‌ను పునరుద్ధరిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఎన్ఎండీసీ ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ బాలునాయక్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రులను కలిసి విన్నవిస్తే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సమావేశంలో రాపాక రమేష్, శీలం విద్యాసాగర్, బుడగం రవికుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాల్వంచరూరల్: మండలంలోని 33 కేవీ యానంబైల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాపురం, కిన్నెరసాని, పునుకుల, పుల్లాయిగూడెం, కోడిపుంజులవాగు, రెడ్డిగూడెం, ఉల్వనూరు, బంజర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వం విద్యార్థులను వేధిస్తోంది..



ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మొదట ధర్నా చౌక్ నుంచి విద్యార్థులు కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు.కలెక్టరేట్‌లోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. నాయకులను అరెస్ట్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ రామ్‌చరణ్, జె.యశ్వంత్‌లపై కేసు నమోదు చేశారు. వీరభద్రం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని కోరారు. మూడేళ్లుగా ప్రైవేట్ యాజమాన్యాల ఒత్తిడికి, ట్యూషన్ ఫీజులు చెల్లించలేక పైచదువులకు వెళ్లలేక 16 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని వాపోయారు. ప్రజాపాలన ఏర్పాటుతో ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారని చెప్పిన ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేసి, నూతన ప్రమాదకర చట్టాలతో విద్యార్థులను వేధిస్తున్నారని ఆరోపించారు. సమస్య పరిష్కారం కాకపోతే భవిష్యత్‌లో మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రజాసంఘాలు, మేధావులు అక్రమ కేసులను ఖండించాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల సమస్యల పట్ల స్పందించి నిబద్ధతతో పనిచేయాలని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం చుంచుపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో చివరి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రజా అవసరాల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను మంజూరు చేస్తుంటుందని, వాటిని అర్హులైన అందించే బాధ్యత ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపైనే ఉంటుందన్నారు. ప్రజలతో ఉద్యోగులు సత్సంబంధాలను కొనసాగించాలని కోరారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్ వచ్చినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రణాళికతో సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మండల పరిషత్ అధ్యక్షురాలు బాదావత్ శాంతి, ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వన మహోత్సవం నిర్వహించండి..



టేకులపల్లి: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

టేకులపల్లి: పదో విడత వనమహోత్సవ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని సులానగర్, గొల్లపల్లి, కొత్తతండా(జి) గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న వన మహోత్సవంలో మామిడి మొక్కల ప్లాంటేషన్, ఎవెన్యూ ప్లాంటేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాంటేషన్ విషయంలో రైతులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కాళంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, కార్యదర్శులు పవిత్ర, వరుణ్, చిట్టి, టీఏలు భీముడు, స్వప్న, వెంకటరమణ, ఎఫ్ఏలు లఖన్, బాలాజీ పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: వాతావరణ సమతుల్యత కాపాడేందుకు మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని 35వ వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి అన్నారు. శుక్రవారం వార్డులోని కూలిలైన్ ప్రభుత్వ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లాల్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి



బస్సు నడపాలని కోరుతున్న మహిళలు

టేకులపల్లి: కొత్తగూడెం – గుండాల మండల కేంద్రానికి వయా టేకులపల్లి, బోడు కాచనపల్లి గ్రామాల మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. శుక్రవారం బోడు గ్రామంలో బోడు, కొప్పురాయి, ఆర్‌సీపేట, బోడుకొత్తగూడెం, పాతర్లగడ్డ, మురుట్ల తదితర గ్రామాల మహిళలు తమ గోడు వెలిబుచ్చారు. గుండాల మండల కేంద్రం నుంచి కొత్తగూడెం పట్టణానికి ఇల్లెందు మీదుగా వెళ్లాలంటే సుమారు 110 కిలోమీటర్లు రావాల్సి వస్తోందని, ఈ కారణంగా ప్రైవేట్ వాహనాలకు అధిక చార్జీలు పెట్టాల్సి వస్తోందని వాపోయారు. టేకులపల్లి, బోడు గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్ సదుపాయం కల్పిస్తే విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలకు, జిల్లా కేంద్రంలో పనుల నిమిత్తం ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

భూనిర్వాసితులతో సమావేశం



రైతులతో ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్

జూలూరుపాడు: సీతారామ లింక్ కెనాల్ నిర్మాణంతో భూములు కోల్పోతున్న జూలూరుపాడు, వినోభానగర్ గ్రామాలకు చెందిన భూనిర్వాసిత రైతులతో శుక్రవారం స్థానిక తహసీల్‌లో తహసీల్దార్ స్వాతి బిందు ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులు సమావేశం నిర్వహించారు. కొత్తగూడెం ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. భూమి కోల్పోయిన ప్రతీ రైతుకు నష్టపరిహారం అందించడం జరుగుతుందన్నారు. ఏన్కూరు నాగార్జున సాగర్ కాలువకు అనుసంధానం చేసేందుకు జూలూరుపాడు–ఏన్కూరు వరకు 8.6 కిలోమీటర్ల లింక్ కెనాల్ పనులు ఆగస్టు 15 నాటికి పూర్తి చేయనున్నట్లు చెప్పారు. సీతారామ ప్రధాన కాలువను పాత డిజైన్ ప్రకారమే నిర్మించనున్నామని, నిలిచిన పనులు తిరిగి కొనసాగించనున్నట్లు చెప్పారు.

అనంతారంలో విషజ్వరాలు



డ్రెయినేజీల్లో పేరుకపోయిన పూడిక



జ్వరంతో బాధపడుతున్న తండ్రీకొడుకులు

- మొక్కుబడిగా పారిశుద్ధ్య పనులు, వైద్యసేవలు
- అధికారులు తీరుపై ప్రజల అసంతృప్తి

జూలూరుపాడు: అనంతారం గ్రామ ప్రజలు విష జ్వరాలతో మంచం పట్టారు. మూడు వారాలుగా విష జ్వరాలతో విలవిలలాడుతున్నారు. ఏ ఇంటి గడపతొక్కినా జ్వరబాధితులే కన్పిస్తున్నారు. బాధితులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామ ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామంలో డ్రెయినేజీల్లోని చెత్తచెదారం, మురుగుతో పేరుకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుండటంతోపాటు, దోమలకు నిలయాలుగా మారాయని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో అధికారులు పారిశుద్ధ్య పనులు మొక్కుబడిగా చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడంతో రోగాల బారినపడాల్సి వస్తుందంటున్నారు. ఊళ్లో జ్వరాలు విజృంభిస్తుంటే స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో వైద్యులు, వైద్యసిబ్బంది నామమాత్రంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారని, మూడు వారాల్లో రెండుసార్లు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందు బిళ్లలు ఇచ్చి పంపించారని వాపోతున్నారు. గ్రామంలో జ్వరాలు అదుపులోకి వచ్చేంత వరకు వైద్యశిబిరం కొనసాగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మెరుగైన వైద్యం అందిస్తాం..



అనంతారంలో వైరల్ ఫీవర్స్‌తో ప్రజలు బాధపడుతున్నారు. ఇటీవల రెండుసార్లు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, వైద్యసిబ్బందిని అప్రమత్తం చేశాం. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్, జూలూరుపాడు